# డోర్ డెలివరీ

**దు**ండగుల దాడికి గురయి, విసిరివేయబడిన శిధిల బేలట్ బాక్స్‌లా... ఊరికి కొంతదూరంలో వుంది పాత బిల్డింగ్! అదే, ఆ ఊరి ప్రాధమిక పాఠశాల!

ఉదయం... స్కూలు వేళ! యధాప్రకారంగా, పాఠశాలకు వచ్చిన విద్యార్థుల్ని ఇళ్ళకు పొమ్మన్నారు హెడ్మాష్టర్‌గారు. "యివ్వేళ స్కూలు లేదు. ప్రజల వద్ద పాలన వుంటుంది..." అని చెప్పారు.

ఆ పిల్లలకు... బోధపడలేదు. ప్రజలన్నా, పాలన అన్నా... బోధపడటానికి... రాజకీయ పరిభాష... తెలీని వయసు వారిది.

"స్కూలు వుండదంటే... సెలవే గదా!" సంతోషంగా, అరుస్తూ, పరుగులు దీయసాగారు, ఇళ్ళకు

" కొంచెం పెద్ద పిల్లల్ని... ముగ్గుర్నో, నలుగుర్నో వుండమనండీ మాస్టారూ, యీ కుర్చీలూ, బెంచీలూ సర్దడానికీ, మంచినీళ్లూ గట్రా తేడానికీ పనికొస్తారు" చెప్పాడు వీడివో జనార్ధనరావు.

హెడ్మాష్టర్‌గారు– ముగ్గురు అయిదవ తరగతి పిల్లల్ని వుంచేరు.

" అద్గద్గో... అదే. రోడ్డు కాడ టర్ను తిరగతంది జీపీ! అదిగో వచ్చేస్తంది...పీ. వీ.. పీ...జీపీ" (ప్రజల వద్దకు పాలన) గాభరా, గభారాగా కేకేస్తూ వచ్చి చెప్పాడు తలయారి.

గబ గబా, వీడివో, తలయారీ, హెడ్మాష్టరూ, మరో అసిస్టెంట్ టీచరు– పిల్లలు ముగ్గురూ... అందరూ కుర్చీలు వేసి, టేబుల్ సరిగా పెట్టి,సమావేశ యేర్పాట్లు చేయసాగారు.

జీప్ వచ్చేసింది. జీప్‌లోంచి నోడల్ ఆఫీసర్‌గారు, ఎమ్మార్వో, ఎమ్డీవో, ఆ మండల పశు వైద్యశాల డాక్టరూ, ఓక్లార్కూ దిగేరు. తలయారీ...అధికార్ల చేతుల్లోని ఫైళ్లను అందుకున్నాడు. వీడివో... అందరికీ ఆసనాలు చూపించేడు.

"... టెన్ దాటిపోతోంది. అధికార్లం వచ్చేసాం గానీ... ప్రజలు యెవరూ రాలేదేంటి?" కుర్చీలో కూర్చుంటూ, ప్రశ్నించేరు నోడల్ ఆఫీసర్‌గారు.

అయితే, ఆ ప్రశ్న యెవరినీ ప్రత్యేకించి అడుగ లేదు గనక- అందరూ మౌనం పాటించి,ఊరివేపు గల దారివేపు చూడసాగేరు.

ఈలోపు, ఊరిలోంచి వి.ఎ.ఓ. వచ్చేడు. వెంట ఓ మనిషి చేత కొబ్బరి బొండాల గెల మోయించుకు వచ్చేడు. బొండాలు కొట్టించి,స్ట్రాలు పెట్టి, తలా ఒక్కోటీ సప్లయి చేయించాడు వి.ఎ.ఓ.

పాలనాధికార్లు... బొండాలు తాగేసారు. అప్పటికీ ప్రజలు రాలేదు.

ఎమ్మార్వోగారు, నోడల్ ఆఫీసర్‌గారూ... ఒకరినొకరు బాగా యెరిగున్నవారు. అలనాడు, మద్యపాన నిషేధం లేని దినాల్లో... అప్పుడప్పుడు 'లక్ష్మి బార్ అండ్ రెస్టారెంట్'లో కలిసి కూర్చునే స్నేహమున్నవారు.

పశువైద్యశాల వైద్యులు... కొత్తగా బదిలీ అయి వచ్చినవారు. నోడల్ అధికారితో గానీ, ఎమ్మార్వోతో గానీ పరిచయం అంతగా లేదాయనకు..అందుకని, తోడ తెచ్చుకున్న 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో "షేర్ మార్కెట్" చూసుకోసాగారు.

"ప్రజల వద్దకు ఓట్లకోసం రాజకీయ నాయకులు రావడము యెరుగుదుము గానీ, ప్రజల వద్దకు పాలనా యంత్రాంగం రావడం... దిస్... ఐ హేవ్ నెవ్వర్ సీన్..." అన్నారు ఎమ్మార్వోగారు.

"ఇప్పుడు ప్రజల వద్దకు పాలన అంటే- యింత వరకూ ప్రజల వద్ద పాలన లేనట్లే గదా అర్ధం? వాడ్డాయూ... సే?" అనడిగేరు నోడల్ ఆఫీసర్.

"ఎస్. ట్రూ సర్..." ఒప్పుకున్నారు ఎమ్మార్వోగారు.

"బట్... ఎనీ హౌ, అవర్ కలెక్టర్ యీజ్ పర్టిక్యులర్ యిన్ దిస్ ప్రోగ్రాం... " అన్నారు నోడల్ ఆఫీసర్‌గారు.

"అవును సార్. కలెక్టర్ ఆల్వేస్ పర్టిక్యులర్... యిన్ ఆల్ ప్రోగ్రామ్స్. ఆయనకేం కష్టం? కష్ట పడేది... మీలాంటి సిన్సియర్ ఆఫీసర్స్. బట్ క్రెడిట్ గోస్ టు కలెక్టర్... " పుల్లవేసి నిప్పు అంటించబోయేరు ఎమ్మార్వో.

నోడల్ ఆఫీసర్‌కి ఎమ్మార్వో కామెంట్ నచ్చింది గానీ, అది... ఎమ్మార్వో గొంతులోంచి వచ్చిందా? గుండెలోంచి వచ్చిందా అన్న అనుమానం కలిగింది.

ఈ విధంగా తెలుగులోనా గ్రామర్ తప్పుల ఇంగ్లీషులోనావారు అలాకాలక్షేపంచేస్తుంటే,క్లార్క్ రికార్డు బుక్స్... కాలమ్స్ తయారు చేసుకుంటున్నాడు. పశువైద్యులవారు 'షేర్ మార్కెట్' పేజీనుంచి 'గ్రహఫలాలు' పేజీలోకి ప్రవేశించేరు.

"బాబో, యెవులో ముగ్గురొస్త్రను...ఇటుకాసే..." అని చెప్తూ, దోవవైపు చూపించేడు తలయారీ.

కొద్దిసేపటికి, ఆ ముగ్గురూ వచ్చేరు.

"వొరసలో నిలబడ్రా..." అన్నాడు తలయారీ. వరసలో నిల్చున్నారు వాళ్లు.

"ఒక్కొక్కర్నే... వొదులు" అన్నాడు క్లార్క్.

"దండాలు బావ్... "

క్లార్క్- కాలమ్స్‌లోకి దృష్టి సారించి "నీ పేరు...?" అడిగేడు.

"కోదండ రాజియ్య... "

"ఊరూ...?"

చెప్పాడు రాజియ్య.

నోడల్ ఆఫీసర్‌గారు- విలేకర్ల కోసమూ, ఫోటోగ్రాఫర్ కోసమూ చూస్తున్నారు.

రాజయ్య- తన ఊరు చెప్పాక- క్లార్కు మళ్లీ- "యింతకీ నీ సమస్యేమిటి? ఏదీ దరకాస్తు?" అని ప్రశ్నించేడు.

రాజయ్య, చేతిలో పట్టుకున్న దరకాస్తు అందివ్వబోతుంటే-

నోడల్ ఆఫీసర్‌గారు కుర్చీలోంచి లేచి నిల్చుని, రాజయ్యను ఆగమని చెప్పి కార్కుతో- 'విలేకర్లు రానీవయ్యా-' అనన్నారు యింగ్లీషులో.

"ఔనాను, ఫోటోగ్రాఫరూ రావాలి..." వంతగలిపేరు ఎమ్మార్వో.

క్లార్క్, కలం రిజిష్టర్ మీద పడేసి, కుర్చీవెనక్కి వాలేడు.

రాజయ్య, దరకాస్తు పట్టుకుని చూపిస్తూ-

"యేలినవోరి ఆఫీసు మెట్లు... యెక్కి దిగి అలిసిపోనాను బావ్. ఆశలొదులుకున్ను. ఇప్పుడు, యేలినవోరే- మా ముంగిటి కొస్తన్నరంతే... మళ్లా... ఆశ కలిగింది..." చెప్తున్నాడు.

నోడల్ ఆఫీసర్‌గారు... యిబ్బందిగా వింటూ కుర్చీలో, అటూ యిటూ కదుల్తున్నారు.

తలయారీ గబగబా వచ్చి-

"బావూ, యెలిపోవస్తన్రు జనం! తీర్థం ప్రజ! మరి, తమరికి యిక్కడే పొద్దుబోద్దిగావాల! అంత మందొస్తన్రు. బేగి, వచ్చినోళ్లని తోలీయండి..." అని తొందరచేసాడు.

నోడల్ ఆఫీసర్‌గారు, క్లార్క్ వైపు చూసేరు. క్లార్క్ కలం సర్దుకున్నాడు. రాజయ్య గొంతు సర్దుకున్నాడు.

"ఇద్దరు పిల్లలు సాలు నీకు. ఆపరీసన్ సేస్కోవయ్యా. నువ్వు సక్కగా బతకడంకి... బేంకు నుంచి రెండు గేదలకి లోన్సూ, రెవిన్యూ వోర్నుండి భూమి పట్టా, మండలాఫీసుకాంచి... స్టీలు బిందెకుండలూ... యిస్తామన్రు. నిజివే అనుకున్న.

ఆపరీసనయిపోయింది. ఆస్పత్రోలు కుట్లు యిప్పేసి సేతులు దులిపేసేరు. గేదెలూ లేవు, భూమీ లేదు, ఎమ్మార్వో కాడకెల్తే... ఎమ్డీవో కాడకి యెల్లమంతారు. అక్కడికెల్తే డిఆర్‌డియ్యే... కెళ్లు అంతారు. ఆళ్లేమో బేంకు కెళ్లు అంతారు. బేంకీవోళ్లు... డిపోసీటు యెయ్యివోయ్ పొదుపు నేర్చుకోవోయ్ అంతారు! ఆకరికి, ఆసికాలయిపోయింది అందరికీ నన్ను చూస్తే! మానాటోలిని యిలగ తిప్పిసంపటం మీకు ధర్మమా? సెప్పండి!" రాజయ్య గోడు వెళ్లగక్కుకున్నాడు.

"అన్నీ... యిలాటివేని బావ్! లోన్స్ యివ్వలేదనో, కార్డులు యివ్వలేదనో, కోలనీ కావాలనో, భూములు కావాలనో... అన్నీ అవే... అలాంటివే వొత్తాయి దరకాస్తులు... " రాబోయే దరకాస్తులు యెలాటివో తేల్చి చెప్పాడు తలయారీ.

రెండో వ్యక్తిని వొదిలేడు.

క్లార్క్ అతని పేరూ, ఊరు వివరాలు నోట్ చేసుకున్నాడు.

"బేంకీవోళు యిచ్చిన లోన్స్ గేద... చూలు పోయింది బావ్..." దరకాస్తు యిచ్చి, చెప్పాడు వ్యక్తి.

"...అయితేటంతావ్? నీ గేదకి పొర్లుకి తీసుకొచ్చేవా యేటి అయ్యగార్లు కాడకి...?" తలయారీ, హాస్యమాడేడు మోటుగా.

నోడల్ ఆఫీసర్ సీరియస్‌గా చూసేరు. తలగోక్కుంటూ వెళ్లిపోయేడు తలయారీ.

" ...అదిగాదు బావ్. అసలకి, మాకే దిక్కులేదు. మా పీకమీదకీ... గొడ్డు గేద తయారైంది. దానికి గడ్డీ, గాదం చూస్తామా, చిట్టూ తవుడూ తెస్తామా, మా కడుపులుకి గెంజినీళుకి దేవిస్తామా? అందికని, గేదని చింతాడ సంతకి తోలేం. గొడ్డు గేదరా... యిది... అన్సెప్పి దళారోడు- సగానికి ధరగట్టేడు. ఏటి సేస్తాం? ఎంతో... కొంత! చచ్చినోడి పెళ్లికి...వచ్చినంత కట్నం... అన్సెప్పి అమ్మీసేం! అమ్మీసి, ఆ సొమ్ము అలాగ... ముడుపుగట్టి తెచ్చి- బేంకువోళు కిచ్చీసినాం. అందులోంచి, ఎర్రని యేగాణి...టీనీలు కయినా కర్చు బెట్టలేదు. అలాగ, తెచ్చి యిచ్చినాం! ఇచ్చినామా? ఇస్తే ఆ బేంకోళు... హెల్ గేదయినా సూపాల లోన్సు అయినా తీర్సాల పూరాగా! అంతేగాని, సగం సగం... బేరమేటి? అన్సెప్పి కస్సుబుస్సుమని...

కడకి కోర్టుకి లాగినారు బాబ్... మిగిలిన బాకీకి! మెల్లకన్నుకి మందేస్తే...ఉన్నకన్ను పోయిందట... అలగయ్యింది నాకు! సబ్సిడీ గేదెల్లోన్స్‌కి ఆశిబడితే... కోర్టు కర్చులుకి యిల్లూ, పొల్లూ పోయినట్టుగుంది. మరి, తమరే ఆదుకోవాల!" బ్రతిమాలసాగేడు ఆ వ్యక్తి.

"దరకాస్తిచ్చీసి, వొచ్చేయిరా నాయినా! ఏలినవోరు నీ దరకాస్తుకి జవాబు... నీ యింటికే అంపిస్తారు. వొచ్చీరా..." కేకేయసాగేడు తలయారీ.

"జవాబులు... డోర్ డెలివరీ..." హాస్యమాడేడు కుర్ర ఆర్.ఐ.

ఆ తర్వాత, మూడో వ్యక్తిని వొదిలేడు తలయారీ.

మూడో వ్యక్తి మూడు దరకాస్తులు అందిచ్చేడు.

మూడు అడుగుల నేల అడిగిన వామనుడు కాదు గదా...? సంశయంగా- ఆ వ్యక్తిని చూడసాగేరు నోడల్ ఆఫీసర్‌గారు.

బారులు దీరి, ప్రజలు నిల్చోసాగేరు. ఆ వరుస చూసి తొందరగా తేల్చేయాలని మూడో వ్యక్తి దరకాస్తుని పరిశీలించకుండానే పంపించేసారు.మధ్యాహ్నం భోజనాలకు గూడా లేవకుండా దరకాస్తులు స్వీకరించి, సాయంత్రానికి..వాటిని కేటగిరివారీగా విభజించి- విలేకర్ల ముందు- వాటిపై తదుపరి చర్య గురించి వివరిస్తూ ఉపన్యసించేరు నోడల్ ఆఫీసర్‌గారు. తిరుగు ప్రయాణానికి, పి.వీ.పీ. జీప్ సిద్ధమైంది.

ఇంతలో- గండి ముసలయ్య వొచ్చేడు. బాగా నీరసించి వున్నాడు. నడుముకి కట్టిన అయిదు మూరల గావంచా చిలకట్టు తప్ప... ఒంటిమీద మరే గుడ్డా లేదు. చేతిలో దరకాస్తు లేదు. జుత్తు రేగిపోయి, మనిషి చెమటల్తో నిండిపోయి... యేడుస్తూ దండాలు పెట్టాడు అధికార్లకు.

"కార్యక్రమం అయిపోయింది మళ్లీ విడతలో చూద్దాం" అన్నారు నోడల్ ఆఫీసర్‌గారు.

"అదికాదు బాబ్, నీను లోన్స్‌గాని, కోలనిగాని, భూమిగాని, పుట్టగాని...యేలినవోరి నుంచి యెర్రని నయాపైస గానీ అడగటానికి రాలేదు..." అన్నాడా వ్యక్తి దీనంగా.

విలేకర్లలో వొకాయన, ముసలయ్య మాటలకు ఆశ్చర్యపోతూ ఫోటోదీసేడు ముసలయ్యను.. న్యూస్ కేప్షన్ ఆలోచిస్తూ!

నోడల్ ఆఫీసర్‌గారు- గాభరాపడ్డారు.

"మరేంటి? ఎందుకొచ్చేవు? ఏది దరకాస్తు?" అనడిగేరు.

"...నా బిడ్డ కన్పించలేదు బావూ! పాతిక సంవత్సరాలు.. ఆడ్ని పెంచినాను. ఎదిగొచ్చిన కొడుకు బాబ్... ఎవులో మాయజేస్సారు. ఈముసలికాలంల నాకూ, నా ఆడదానికీ... కొడుకే ఆధారం బాబ్! ఆడు... అవుపించలేదు బాబ్..." గొంతు, దుఃఖంతో జీరపోయింది.

"ఎన్నాళ్లయి కన్పించలేదు...?"

"మూడు దినాలయి బావూ..."

ఆతర్వాత, విలేకర్లు అనుమానపు ప్రశ్నలేవో వేసారు. నోడల్ ఆఫీసర్‌గారు- ముసలయ్య అడ్రసూ, కొడుకు వివరాలూ నోట్ చేయమని క్లార్క్‌కి ఆర్డరేసారు. అందరూ, జీపు యెక్కేసారు. ముసలయ్య... నోడల్ అధికార్ని వొదలటం లేదు. జీపు ప్రక్కగా పరిగెత్తసాగేడు.

"మలి విడత శ్రమదాన కార్యక్రమంకి వొస్తాం. అప్పటికి భోగట్టా చేస్తాంలే..." నోడల్ ఆఫీసర్.. జీపు ధూళితో కేకేసి చెప్పారు.

★ ★ ★

శ్రమదాన కార్యక్రమం సందడిగా ఆరంభమైంది. మంత్రిగారు, మండలి స్థాయి నాయికులూ, తులసినాయుడూ, ప్రభుత్వాధికారులూ హాజరయినారు. మట్టికట్ట మోస్తూ-కెమెరాకూ,యాటీవీ కెమెరాకూ ఫోజులిచ్చేరు మంత్రిగారు. ప్రక్కనే తులసినాయుడూ నిల్చున్నాడు... పాత్తి కమీజూ, పంచె... ఖరీదుగా కన్పిస్తున్నాడు. శ్రమదానకార్యక్రమం ఆరంభించిన మంత్రిగార్ని అభినందిస్తూ చప్పట్లు కొట్టేడు. హంగామా అంతా అయ్యింది.

గండి ముసలయ్య.. మట్టితట్టలు మోసి, మోసీ అలసి పోయి మంత్రిగారు.... మరెక్కడికో వెళ్లేందుకు బయల్దేరిపోతుంటే... నోడల్ అధికారితో - "బావూ... మంత్రిగోరికి సెప్పరాదా... సాయం జేయడా?" అని బ్రతిమాలేడు.

నోడల్ ఆఫీసర్ - మంత్రిగారికి ముసలయ్య గురించి వివరించేడు.

మంత్రిగారు, వెంటనే ఎస్పీగార్ని పిలిచి ముసలయ్య కొడుగు గురించి వాకబు చేయమని ఆదేశించి మరో శ్రమదాన శిబిరానికి పయనమయ్యేరు. వారితో పాటే... తులసినాయుడూ వెళిపోయేడు.

ఎస్పీగారికి - అంతకుముందే కొంత సమాచారముంది. ముసలయ్యను చూస్తూ -

"మీ అబ్బాయిపేరు... మోహనా ? " అని అడిగేరు.

ముసలయ్య మొహం వెలిగింది ఆశతో.

"ఔను.. బావ్.."

"పాటలు పాడతాడా బాగా... మీ వాడు?"

"కంచుకంఠం బావ్. ఆడు పాడితే... పాములు తలలాడించియినాల...అంత బాగ పాడతాడు" గర్వంగా, కొడుకు గాన విద్య గురించి చెప్పాడు ముసలయ్య.

"ఈ మద్య పాడేడా...?"

"ఎప్పుడో... నవరాత్రులకీ, దశమికీ ఊరిల సంబరాలయితే పాడతాడు. ఈ మధ్య పాడటం సూడ్లేదు బావ్.."

"రాత్రుళ్లుపాడుతున్నాడట ? ఆ పాటలు పాడితే ప్రమాదమయ్యా.."

"ఏ పాటలు బావ్..?"

"ప్రమాదమైన పాటలయ్యా.."

"అవే.. యేటి బావ్..?" అర్థంగాక అడిగేడు ముసలయ్య.

నోడల్ ఆఫీసర్‌గారికి - యీ ప్రశ్నా, జవాబులతంతు - అర్థంగాని ఆంగ్ల సినిమాలో దృశ్యంలా వుంది.

"మీ ప్రక్క ఊరిల అన్నలు ప్రజాకోర్టు పెట్టారట గదా?" ప్రశ్నించారు ఎస్పీగారు.

"ఏమో తెల్దు బావ్.." చెప్పాడు ముసలయ్య.

"నోడల్ ఆఫీసర్‌గారికి... కిందటి పి.వీ.పీ. లో దరకాస్తు యిచ్చావటగదా ? ఆయన మాకు లెటర్ రాస్తే.. నీ కొడుగు గురించి ఎంక్వయిరీ చేయించేను. ఇవన్నీ ఎంక్వయిరీలో తెల్సినయి. తులసినాయుడు... ఇంకా బోల్డు చెప్పాడు. మీ అబ్బాయి గురించి, ఎంక్వయిరీ చేస్తున్నాం.." అని చెప్పారు ఎస్పీగారు. ఆ జవాబు - యిటు ముసలయ్యకే గాక అటు నోడల్ ఆఫీసర్‌గారికి కూడాను!

అంతే. అంతవరకే చెప్పి తన బాధ్యత తీరిందన్నట్లుగా - వెళిపోయేరు ఎస్పీగారు.

ముసలయ్యకు, యేమీ పాలుబోవడం లేదు. ఎస్పీగారు - యేం చెప్పారో అర్థంగాలేదు. బిక్కు, బిక్కుమంటూ నిల్చున్నాడు.

"... తులసినాయుడెవరయ్యా? మీ అబ్బాయి గురించి - అతను భోగట్టా చెప్పాడంటారేంటీ ఎస్పీగారు ...?" అడిగేరు నోడల్ ఆఫీసర్‌గారు.

"తులిసినాయుడ్డు తెల్దాబాబ్? ఇందాక, మంత్రి గోరి పక్కన, పాత్తి బట్టలేసుకొని నిలబడి - చప్పట్లు గొట్టినోడ్ని సూడ్లేదా ? అతగాడే తులసినాయుడ్డు. అతగాడు... బోల్డు సెప్తాడులెండి. కుర్రోళ్లంటే - యీ మద్దెన అతగానికి సలీ జొరంగా వుంది. కుర్రోళ్ళందరూ... అన్నల్లాగే అవుపడతారు అతగానికి. ఆ మద్దెకాన... అన్నలు అతగానికి వొడ్డించేసినారు గదా.... తీర్థం వొండుతుండని? బడిత పూజ జేస్సారు! అదీకత ! అందికని, అతగాను యేదేనా సెప్తాడు..." తలయారీ, విషయాన్ని అతని ధోరణిలో వివరించేడు.

నోడల్ ఆఫీసర్‌గారు - తలయారీ మాటల్ని అర్థం చేసుకోవటానికి ఆ మాటల్ని నెమరువేసుకుంటున్నారు.

"... బావూ, యింతకీ ఎస్పీగారు ... యేటి సెప్పారు నా బిడ్డడి గురించి...?" అడిగేడు ముసలయ్య

" నాకూ అర్థం గాలేదయ్యా. బహుశా, యింకా ఎంక్వయిరీ పూర్తిగాలేదేమో త్వరలో తేలుస్తారులే. మంత్రిగారి వరకూ వెళ్లింది గదా విషయం" త్వరలో తేల్తుందని భరోసా యిచ్చేరు. నోడల్ ఆఫీసర్‌గారు.

ముసలయ్య - దిగాలుగా యింటివేపు నడిచేడు.

★ ★ ★

మరుసటి రోజు. తెల తెలవారే వేళ, చీకట్లు... తొలగే వేళ! మెలకువలోకి వచ్చిన ముసలయ్య, యింటి గడపలోని, కుక్కిమంచమ్మీద కూర్చుని కొడుకును తలచుకు... కుమిలిపోతున్నాడు.

జీపు యేదో వచ్చి, వీధివాకిట్లో ఆగిన శబ్దం 'ధబ్' మని యేదో మూట కిందపడిన శబ్దం వినిపించింది ముసలయ్యకు.

ఏవిట్రా అని మంచంలోంచి లేచి, వీధిలోకి వచ్చేసరికి, జీపు కదిలివెళ్లిపోయింది. 'దబ్' మంటూ పడింది గదా, యేవిటది - అని చుట్టూ చూడబోతే... చిన్నగా మూలుగు వినిపించింది. గబ, గబా ముసలయ్య.... మూలిగే మనిషి దగ్గరకు వెళ్లాడు. ఒంటినిండా గాయాలతో, నెత్తుటి ముద్దలా పడివున్నాడు కొడుకు... మోహన్ ! ముసలయ్యకు గుండెల్లో గునపాలు గుచ్చినంత బాధ కలిగింది !

" మోహనో... నాయినా, మోహనా ?" అంటూ ఆక్రోశంగా పిలిచేడు. ఆ కేకకు... యింట్లోంచి ముసలమ్మ ఆందోళనగా బయటికొచ్చింది. నెత్తుటి బిడ్డను చూసి,, నెత్తీ నోరూ బాదుకు యేడ్వసాగింది.

ఈ గోలకు యిరుగూ, పొరుగంతా చేరుకున్నారు. అందరూ, మోహన్ చుట్టూచేరి, బాధగా చూస్తున్నారు.

"...యేటి? యేటయ్యింది ? ఎవులీ దురుమారగం జేసారు.?"

"గబాల్ని ఆస్పత్రి కొట్టుకెళ్లరా..."

"కాదిపుడో జీపు వొచ్చింది. ఎవుల్దిఅది?"

"జీపీని ఆపాల్సింది. జీపీతోటి కలిపి తగలెట్టిద్దుం..ఆళ్ళని"

తలా, ఒక రకంగా.. యిరుగూ పొరుగూ సానుభూతి మాటలాడుతున్నారు.

ముసలయ్య యేమీ వినటం లేదు. యేడ్చి, యేడ్చి... చివరికి తనను తాను ఓదార్చుకొని యేదో నిర్ణయానికి వొచ్చినట్లుగా లేచాడు.

"నాయినా, మోహనో.. నీ పేణం పోనీయను. నా పేణం ధారోసి నిన్ను నిలబెడతాను..." అంటూ, కొడుకును భుజానికెత్తుకున్నాడు.... ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు!

ఇరుగింటాయన బండీ - ఎడ్లు సిద్ధం చేసాడు.

ఆపల్లె అంతా బండి వెనక కదిలింది.

* * *

*(ఆంధ్రజ్యోతి వారపత్రిక 19.7.1996)*